ఊరిస్తున్న వరుణుడు... కన్నీరు పెడుతున్న రైతులు

విశాలాంధ్ర-జలుమూరు: గత కొన్ని రోజులుగా ఏరువాక పౌర్ణమి జరిగాక అనేక గ్రామాల్లో రైతులు విత్తనాలు వేశారు. విత్తనాలు వేసి రోజులు గడుస్తున్న వరుణ దేవుడు కనికరించకపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. జలుమూరు, సారవకోట మండలాల గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఎద విత్తనాలు వేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి ఆకు కోసం విత్తనాలు వేశారు. కనీసం చుక్క చినుకు రాలేకపోవడంతో రైతులు హృదయ విదారకంగా బాధ వ్యక్తపరుస్తున్నారు. మంగళవారం సాయంత్రంపై రెండు మండలాల్లో నల్లటి మేఘాలు చీకటి కమ్మడంతో వరుణ దేవుడు కరుణ ఉంటుందని చూసి నిరాశ చెందారు. మేఘాలు మబ్బులే తప్ప చినుకు రాలేకపోవడంతో రైతులు మరో రెండు రోజుల్లో చిన్నపాటి జల్లులు కురవకపోతే వేసిన విత్తనాలన్నీ నష్టపోతాయని రైతులు దిగాలు పడుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిరక్షించాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని కొత్తపోలవలస పంచాయితీ, పాలకొండపేట గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని గ్రామానికి చెందిన దండుపాటి కోటేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయితీ సర్పంచ్, ఐ.వి.శ్యామ్‌కుమార్ తాతలకు చెందిన ఆస్తి గ్రామకంఠంలో వుందని, ఈ స్థలంలో కొంతమంది గ్రామస్థులు పంచాయితీ, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఇళ్ళు నిర్మాణం చేసుకుంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని నరసన్నపేట తహాశీల్దార్‌కు చెప్పామని, ఒక నాలుగు రోజులు పని ఆపి, మరలా ఇళ్ళు కట్టుకుంటున్నారని తెలిపారు. పంచాయితీ సర్పంచ్, శ్యామ్‌కుమార్ చెందిన గ్రామకంఠంలో రెవెన్యూ అధికారులు పొజిషన్ ధృవపత్రం ఇస్తేనే ఇళ్ళు నిర్మాణం చేయాలని, అలా కాని పక్షంలో ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్ళను ఆపాలని అన్నారు. ప్రభుత్వానికి చెందిన స్థలంలో గ్రామస్థులు తమ ఇష్టానుసారంగా ఇళ్ళు నిర్మాణం చేస్తుంటే, సంబంధిత విఆర్వో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని, ఇప్పటికైనా తహాశీల్దార్ ఈ విషయమై దృష్టి సారించి, రెవెన్యూ అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న ఇళ్ళను ఆపాలని దండుపాటి కోటేశ్వరరావు కోరారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కా చెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ములూ డాక్టర్లే...!

విశాలాంధ్ర,పలాస/సోంపేట: సోంపేట మండలం కర్రివానిపాలెంకు చెందిన, ప్రస్తుతం ఉద్యోగ రీత్యా భిలాయి స్టీల్ ప్లాంట్ లో పని చేస్తున్న కర్రి కృష్ణ మూర్తి, కర్రి తులసీ దంపతుల ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు అందరూ డాక్టర్లే. పెద్ద కుమార్తె సుప్రియ, రెండవ కుమార్తె సోనాల్ ఎండి చేయగా, మూడో కుమార్తె స్తుతి ఎం బి బి ఎస్ పూర్తి చేసారు. ఆ తరువాత పెద్ద కుమారుడు శుభమ్ రాజనాంధగావ్ కాలేజీ లో ఎం బి బి ఎస్ మూడవ సంవత్సరం, చిన్న కుమారుడు శివమ్ బిలాస్ పూర్ కాలేజీలో ప్రస్తుతం ఎం బి బి ఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరంతా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం లేకుండా జనరల్ కేటగిరీలోనే చదువుతున్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం భిలాయి స్టీల్ ప్లాంట్ కార్మికుల యూనియన్ ఐఎన్‌టియుసి పూర్వ ఉప ప్రధాన కార్యదర్శి మరియు ఇండియన్ నేషనల్ మెటల్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ ఎస్ రావు డాక్టర్ల తల్లిదండ్రులను దుశ్శాలువతో సన్మానించారు. ఎస్ఎస్ రావు గతంలో కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆడపిల్లల వివాహాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇతోధిక ఆర్థిక సహాయం చేసిన సందర్భాలు కోకొల్లలు.ఈ సందర్భంగా ఎస్ ఎస్ రావు మాట్లాడుతూ - ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఇటువంటి అసామాన్య ప్రతిభావంతులైన సంతానాన్ని కన్న తల్లి తండ్రులు నిజంగా గౌరవప్రదమైన దంపతులు. వీరు సమాజానికి ఆదర్శనీయులు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె చిరంజీవి, డాక్టర్ జ్యోతి, వెంకటేష్, భవాని, వెంకట రావు, కామేశ్వరి ప్రభృతులు పాల్గొన్నారు.అలాగే వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన ముగ్గురు అక్కా చెల్లెళ్ళు ఇద్దరు అన్నదమ్ములను,తల్లి తండ్రులను వాడబలిజ జాతీయ సంఘం భిలాయి అధ్యక్షుడు గనగళ్ళ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి వంక చంద్ర శేఖర్, కోశాధికారి కంబాల పాపారావు,అభ్యుదయ ఆంధ్ర హైస్కూలు, పురేన ప్రిన్సిపాల్ మొరిపల్లి బాబూరావు, ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు రుద్ర మూర్తి, భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు, భిలాయి మత్స్యకార సామాజిక సంస్థ ప్రధాన కార్యదర్శి యెరుపల్లి భాస్కరరావు అభినందనలు తెలిపారు.

నామినేటెడ్ పదవుల కోసం నేతలు ఎదురుచూపులు

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం పార్టీ కోసం పనిచేసిన గ్రామ, మండల స్థాయి నేతలకు పలు నామినేటెడ్ పోస్టులు అందిస్తామనడంతో పలువురు నేతలు ఎదురుచూస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గ జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో నాలుగు సహకార సంఘాలు, జలుమూరు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గతంలో నామినేటెడ్ చైర్మన్‌లుగా పలువురు నేతలు పనిచేశారు. నేడు ప్రభుత్వం మారడంతో ఆ పదవులు చేపట్టిన పలువురు నేతలు రాజీనామాలు చేశారు. ఆ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో పలువురు నేతలు ఆశిస్తున్నారు. గతంలో పిఎసిఎస్ చైర్మన్లుగా కొనసాగిన వ్యక్తులు మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా చేసిన వ్యక్తులు ఆశిస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వ్యక్తులను భవిష్యత్తులో పార్టీ మెరుగు కోసం కృషిచేసిన నేతలను స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పలువురు పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నారని కార్యకర్తలు అంటున్నారు. ఆధ్యాత్మిక పర్యటనలోనున్న ఎమ్మెల్యే రమణ మూర్తి బుధవారం నరసన్నపేట చేరిన తరువాత దీనిపై కసరత్తు జరుగుతుందని పలువురు సీనియర్లు అంటున్నారు.

వినూత్నంగా విద్యా ప్రవేశ్ కార్యక్రమం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మడియారి పుట్టుగ మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి.జ్యోతి అధ్యక్షతన విద్యాప్రవేశ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా ప్రవేశ్ అనే కార్యక్రమం 90 రోజుల వరకు ఉంటుందని అన్నారు. పిల్లలు బడి పట్ల ఎక్కువ ఆకర్షితులు అయ్యేందుకు వీలుగా వినూత్న కార్యక్రమాలను చేపట్టవలసి ఉందని తెలిపారు. ఈ 90 రోజుల కాలంలో విద్యార్థులలో భాష, అక్షరాస్య అభివృద్ధి, జ్ఞానేంద్రియాల అభివృద్ధి, శారీరిక అభివృద్ధి చెందిన వివిధ రకాల కృత్యాలు నిర్వహించారు. తద్వారా పిల్లల్లో సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చునని ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా చేరిన కొత్త పిల్లలకు ఫస్ట్ డే ఆఫ్ స్కూల్ పోస్టర్ లో విద్యార్థులకు వినూత్నంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు పునరుద్ధరించాలి

ఉప్పు కార్మికులు వలసలు నివారించాలి

ఉప్పు శాఖ కమిషనర్‌కు రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారులు సంఘం వినతి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగుడు సాధించాలంటే ఉప్పు ఉత్పత్తిదారుల లీజులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పీరుపల్లి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప్పు పరిశ్రమ శాఖ కమిషనర్ ప్రేరణ జోషి కు కాకినాడలో వినత పత్రం అందజేశారు.2013 సంవత్సరం నుంచి ఉప్పు ఉత్పత్తిదారులు లీజులు నిలిచిపోవడంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, దీంతో లైసెన్స్ దారులు, కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. లీజులు పునరుద్ధరించడంతోపాటు అసైన్మెంట్ ఫీజులు తగ్గించాలని కోరారు. టెండర్ విధానంలో ఉప్పు భూములు అప్పగించాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదని, రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడ సాధించాలంటే లీజులు పునరుద్ధరణ చేయలాని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాచారావు, భీమిలి అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, బుచ్చిబాబు, సంతోష్ కుమార్, నౌపడ డిప్యూటీ సూపర్ రెంటెండ్ ఆఫ్ సాల్ట్ షేక్ ముజ్రేల్ ఇస్లామ్ , తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ వంతెన ఒకవైపు నిర్మాణ పనులు పూర్తి



విశాలాంధ్ర-జలుమూరు : జలుమూరు మండలం నరసన్నపేట, పాతపట్నం ప్రధాన హైవే రహదారి తిలారు రైల్వే గేట్ వద్ద నాలుగేళ్ల క్రితం మంజూరైన ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు ఒకవైపు దాదాపు పూర్తయ్యాయి. మరోవైపు పనులు వేగవంతం చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు జిల్లా పార్లమెంట్ సభ్యులు ప్రస్తుత కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దీనిని పరిశీలించి నిర్మాణం వేగవంతం అయ్యేలా చూడాలని కోరారు.

శ్రీఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలోని శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో సోమవారం అర్థరాత్రి చోరీ జరిగిందని ఆలయ అర్చకులు, శివబాబు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయం తలుపులు తెరవగానే శ్రీ ఆంజనేయస్వామి వారికి అలంకరణ సామగ్రి, ఒక కిలోన్నర వెండి, రూ.10వేల నగదు అపహరణకు గురైందని అన్నారు. చోరీ జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి, పరిశీలించగా సిసి కెమెరాలకు టూత్ పేస్ట్ అంటించి, దొంగలు దొంగతనానికి పాల్పడ్డారని తెలిసింది. అలాగే క్లూస్ టీం వచ్చి, దొంగల చేతి వేళ్ళ అచ్చులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్.ఐ, బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో కంచిలి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సోంపేట : కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇండియన్ స్కూల్ ఆఫ్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ 2023-24 విద్యా సంవత్సరానికి గాను జనవరిలో నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. 5వ తరగతికి చెందిన నర్తు రామ్ రన్వీర్‌కు గోల్డ్ మెడల్‌తోపాటు 1500 నగదు బహుమతి, లక్ష్మీనారాయణ పాయికోకి సిల్వర్ మెడల్, కంబాల మహిత్‌రెడ్డి కాంస్య పతకం లభించాయి. 3వ తరగతికి చెందిన నల్లాన వెనీషాకు గోల్డ్ మెడల్, 2వ తరగతికి చెందిన బర్రి శివాని గోల్డ్ మెడల్ సాధించారు. వీరికి గైడ్ టీచర్‌గా నల్లాన రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు ఆర్.కామరాజు, ఉపాధ్యాయులు జె.భగవతిరావు పి.బాసంతి, నల్లాన రవి, వై.ఢిల్లేశ్వరరావు, వై.శంకరరావు, సంతోష్‌కుమార్ పండా, నాగరత్నం, డి.భాగ్యం పేరెంట్స్ కమిటీ చైర్మన్ వంకల దుర్యోధన అభినందనలు తెలిపారు.

విలువిద్యలో లక్ష్మీ తన్విక ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని కొంగరాం గ్రామానికి చెందిన గోపిన లక్ష్మి తన్విక

విలువిద్య పోటీల్లో ప్రతభ చాటింది. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో అండర్ -15 కాంపౌండ్ విభాగంలో తన సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతుంది. నగరం లోని అర్జున ఆర్చరీ అకాడమీలో శిక్షణ తీసుకుంటుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీ తన్వికను అకాడమీ కోచ్లు ఎ.మధుసూదనరావు, ఎ.శ్రీనివాస రావు, ఈశ్వరప్రసాద్, అకాడమీ ప్రతినిధులు గోపిన కృష్ణప్రసాద్. పి.గోవిందరావు. శివాజీ, శ్రీనివాసరావు, తిరుపతిరావు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



విశాలాంధ్ర - జలుమూరు: మండలం జోనంకి పంచాయతీ పరిధి గంగాధర్ పేట కూడలి ప్రదేశంలో ప్రధాన రహ దారిపై కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందారు. పాతపట్నం నుండి వైజాగ్ వైపు వెళ్తున్న ఏపీ 39 కేవై 25 88 నెంబర్ గల కారు జలుమూరు మండలం రాణ గ్రామానికి చెందిన వాన సింహాచలం (70) స్వగ్రామం రాణ నుండి ఊడికలపాడు మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు సమీపంలో వెళ్తుండగా అతి వేగంగా వస్తున్న కారు ఆయనకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు స్థానిక ఎస్సై మధుసూదన్ రావు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం కోటబొమ్మాళి పంపించారు. మృతుడుకు భార్య ఈశ్వరమ్మ పెద్ద కుమారుడు లింగమూర్తి రెండవ కుమారుడు గోపాలరావు ఒక కుమార్తె ఉన్నారు. మీరందరికి వివాహం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. కళ్ళముందే కనిపించిన సింహాచలం కనురెప్ప పాటిలో తిరిగిరాని లోకానికి వెళ్లడం భార్యతో పాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

నీట్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
- కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి
- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నీట్ పరీక్షలో జరిగిన అవినీతి మీద సిట్టింగ్ జడ్జీ తో విచారణ జరిపి, బాధ్యత గా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఎస్ ఎఫ్), అఖిలభారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణ కేంద్రం అరసవెల్లి జంక్షన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం అందులో ఆ ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్ కి సంబంధించి రావడం వెనుక బీహార్ కు చెందిన ముఠా ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుండి రూ.30 లక్షలు వసూలు చేసి దొరికిన కూడా వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం ఎన్.టి.ఎ విడుదల చేసిన పరీక్షా ఫలితాలపై, పేపర్ లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యుజిసి నెట్ పేపర్ లీకేజీ అయిందని కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని నీట్ పేపర్ ఎందుకు రద్దు చేయరో 24 లక్షల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని కోరారు. గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని 24 లక్షల మంది విద్యార్థులకు మళ్ళీ నీట్ పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని లేనిపక్షంలో వారి కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కిరణ్ కుమార్, చందు, సాయి, ప్రదీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- విత్తనాలు పంపిణీలో ఎంఎల్ఏ గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని శాసనసభ్యులు గొండు శంకర్ సూచించారు. గార మండల కేంద్రంలో సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం దేశానికి వెన్నెముఖ లాంటి రైతన్న నడ్డి విరిచిందని ఆరోపించారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక, అష్టకష్టాలు పడి పంట పండించినా గిట్టుబాటు ధర లేక, బిల్లులు చెల్లించకపోవడంతో రైతాంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వరుణుడు కూడా కరుణించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, మేలైన, అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా సిద్ధంగా ఉంచడం జరిగిందని చెప్పారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకుని, అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడి జి. రజని, ఏఓ డి. పద్మావతి, ఎంపీడీఓ బి. కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

విశాలాంధ్ర-కవిటి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ ఐ కె.రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రమైన కవిటి ఎస్విజె విద్యాసంస్థలలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు ఎస్ వి జె డిగ్రీ కాలేజ్ 1,2 ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాము విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాము మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు వాడితే జీవితం అంధకారం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మత్తు మందు వాడడం వలన శరీరంలో తెలియని మార్పులు చోటు చేసుకొంటాయన్నారు.ముఖ్యంగా విద్యార్థి దశలోనే మత్తు బానిస అవుతారని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహ పెంచుకొని గ్రామాల్లోని ప్రజలకు వాటి పరిస్థితి గురించి వివరించాలని తెలిపారు. విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ బారిన పడి ఎంతో మంది జీవితాలు దుర్భరం అయ్యాయని, వ్యసనాలకు బానిసలుగా కారాదన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విషయం తెలిసిన తక్షణమే సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రు ల కష్టాలు గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అలాగే విద్యార్థులు లైసెన్స్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం ప్రమాదం అని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువత వల్ల జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్ ఎం భాస్కరరావు, పి సత్యనారాయణ, ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు మహేష్, జగన్నాయుకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత గ్రామాల రుణం తీర్చుకోలేనిది

- స్వగ్రామాలకు రుణపడి ఉంటా
- ఎమ్మెల్యే బెందాలం అశోక్

విశాలాంధ్ర-కవిటి: ముచ్చటగా మూడుసార్లు తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అలాగే స్వగ్రామాలైన రామయ్యపుట్టుగ, ప్రగడ పుట్టుగ గ్రామ ప్రజలకు ఎన్నడూ రుణపడి ఉంటానని ఎప్పటికీ వారి రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే అశోక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రగడపుట్టుగ శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో జంట గ్రామాలైన ప్రగడ పుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాల ప్రజలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్ కు పౌర సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ ను శాలువాతో సత్కరించి వినాయక విగ్రహాన్ని బహుకరించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ తన తండ్రి ప్రకాష్,గురువులు చెప్పినట్లుగా ఎమ్మెల్యే పదవి పదవిగా భావించకుండా సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. తన తండ్రి ప్రకాష్ రాజకీయాల్లో ఉంటూ ఒకరోజు యాదృచ్ఛికగా తనకు రాజకీయ ప్రవేశం చేయాలని సూచించారని అన్నారు.తనకు వైద్యరంగంపై మక్కువ ఎక్కువ అని రాజకీయాలపై ఆసక్తి లేదని తండ్రి మాట కాదనలేక రాజకీయ ప్రవేశం చేయవలసి వచ్చిందని అన్నారు. తన తండ్రి ప్రకాష్ ఆశయ సాధకుడు అని అన్నారు. తప్పనిసరి పరిస్థితి రాజకీయ ప్రవేశం చేసిన తనకు రాజకీయంపై అవగాహన లేక రాజకీయ ఒడిదుడు కులకు ఎదుర్కొని మీ అందరి చల్లని ఆశీస్సులతో వరసగా మూడు సార్లు విజయం వైపు నడిపించారని అన్నారు. జంట గ్రామాలలో ప్రతి కుటుంబంతో తన కుటుంబం కు వ్యక్తిగత సంబంధం ముడిపడి ఉందని అన్నారు.జంట గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి ఎన్నికల సమయం రెండు నెలల పాటు వ్యక్తిగత బాధ్యతగా వ్యవహరించి తన గెలుపుకు కృషి చేశారని అన్నారు. అందరికీ పేరుపేరునా పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. ఇంతటి అభిమానంతో మూడుసార్లు ఎమ్మెల్యే గెలుపునకు నిరంతరం కృషి చేసిన జంట గ్రామాల ప్రజలకు తన జీవితం మొత్తం రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బెందాళం కింగ్, పి కృష్ణారావు, రాంప్రసాద్, రవికుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు పి బలరామమూర్తి, సంతోష్ కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పెంచిన పెన్షన్ల పంపిణీ

- విలీన పంచాయతీల సమస్యలకు పరిష్కారం చూపుతా
- ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పెంచిన పెన్షన్ బకాయిలతో పాటు ఏడువేల రూపాయల పెన్షన్ పంపిణితో జులై ఒకటవ తేదీన పండగ వాతావరణం నెలకొనబోతోందని శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో తనకు ఘన విజయాన్ని అందించిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించానని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టామని, వంశధార కుడి ప్రధాన కాలువను పరిశీలించి అడ్డంకులు గుర్తించడం జరిగిందన్నారు. వాటిని తక్షణమే బాగుచేయాలని, లేకుంటే ఏడురోడ్ల కూడలిలో అమరణ నిరాహార దీక్ష చేస్తానని ఇరిగేషన్ అధికారులకు హెచ్చరించడంతో పనులు ప్రారంభం అయ్యాయన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కంటే అదనంగా 350 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆమదాలవలస ప్రధాన రహదారి మరమ్మతు పనులు చురుకుగా జరుగుతున్నాయని అయన తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల గురించి మున్సిపల్ శాఖమంత్రి నారాయణతో మాట్లాడడం జరిగిందని, అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నిలిచిపోయిన టెండర్ పనులను పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. విలీన పంచాయతీల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని, కలెక్టర్‌తో సమావేశమై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సంరక్షకుడిలా ఉంటానని, ఎప్పుడు పిలిచినా తక్షణమే స్పందిస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ సమస్యలను గుర్తించడం జరిగిందని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. బుధవారం నుంచి శాఖలా వారీగా సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ గా నిలపడానికి ప్రజలు, పార్టీ నాయకులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

బి ఆర్ ఏ యు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అనురాధ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్ కామర్స్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఎసి)గా సోషల్ వర్క్ విభాగాన్ని చెందిన సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం అనురాధ నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత నియామక ఉత్తర్వులు జారీ చేశారు వర్సిటీలో ఇప్పటికే డాక్టర్ అనూరాధ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్గా వ్యవహరిస్తున్నారు. సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ విశాలాంధ్ర ఎచ్చర్ల మండలంలోని పలు గ్రామాల్లో సబ్సిడీ వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు ఎచ్చెర్ల లో మండల సర్పంచ్ల మాజీ అధ్యక్షుడు మెండ రాజారావు, మాజీ ఉపసర్పంచ్ మూకల్ల భాస్కరరావు, పూడి వలసలు మాజీ సర్పంచ్ గొలివి గోవిందరావు సమక్షంలో విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాతృమూర్తి యువజన సేవా సంఘం 15వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని కుసుంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సేవా సంఘం 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదే గ్రామానికి చెందిన జుత్తు అమ్ముడమ్మ కుటుంబానికి అన్నపూర్ణ అమృతహస్తం పేరిట నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న అర్జి లక్ష్మణ్ అనే యువకుడికి 3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం సీతయ్య ఫౌండేషన్ లో ఉన్న వృద్ధులకు, అనాథలకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. కేకు కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామర్థ్యం లేని పని వాళ్ళతో

నడిపే సామర్థ్యం అధికారులకు ఉందా?

- ఎన్నికలు ఎప్పుడు జరిగినా 23 వార్డులే
- పురపాలక సంఘ సమీక్షలో ఎమ్మెల్యే రవి కుమార్

విశాలాంధ్ర-ఆముదాలవలస: సామర్థ్యం లేని పని వాళ్ళతో పురపాలక సంఘాన్ని అభివృద్ధిపదంలో నడిపించడం సాధ్యపడు తుందా అని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం సమీక్ష సమావే శంలో వివిధ శాఖల పనితీరుపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఆదాయం పెంపొందించి అభివృద్ధి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. విధానాలు మార్చుకోకుంటే మీ స్థానంలో వేరే వారిని తెచ్చుకుంటా మని స్పష్టం చేశారు. గతంలో 42 స్లమ్ ఏరియాలకు గాను పూర్తిగా వాటిని క్లోజ్ చేసినట్లు వివరించారు. ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల నిర్లక్ష్యం వహి స్తే సహించనన్నారు. పట్టణంలో 136 చెరువులు ఉంటే 96 చెరువుల ఎందుకు చూపిస్తున్నారని నిలదీశా రు.2014లో నీరు చెట్టు కింద 42 చెరువులను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు.

ఎన్నికలు ఎప్పుడు జరిగినా 23 వార్డులే...

పురపాలక సంఘ పరిధిలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన 23 వార్డులే ఉంటాయని ఎమ్మెల్యే రవికుమార్ స్పష్టం చేశారు. వార్డులు విభజనలో 27 వార్డులుగా మార్చినప్పటికీ కోర్టు కేసులు నడుమ ఉండడంతో గత స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్నికలు జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికలు ఎప్పుడు జరిగినా 23 వార్డులే ఉంటాయని గాని అందు కు తగ్గ విధంగానే ప్రణాళిక తయారు చేయాలని కమిషనర్ కు ఆదేశించారు. విభాగలవారీగా జరిగిన సమీక్షలో ఉన్న చాలా పెండింగ్ బిల్లులు ఉన్నా యని వాటిపైన పూర్తి గైడెన్స్ తో సమాచారం అందించాలన్నారు. మున్సిపాలిటీలో ఫుట్ పాత్ పై ఉన్న బడ్డీలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కోర్టు భవనానికి అను కుని ఉన్న వాటితో పాటు మార్కెట్ చుట్టూరా ఉన్న వాటిని కూడా తక్ష ణమే తొలగించాలన్నారు. అలాగే పాలపోలమ్మ గుడి చెరువును చదు ను చేసేందుకు ఎంత ఖర్చయిందో నివేదికను అందించాలని ఏఈ ఆదేశించారు. ట్యాక్స్ వసూళ్లలో నిర్లక్ష్యం జరిగితే అటువంటి వారిపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆదాయాలు, వచ్చే రాబడులు, చేసిన వ్యయం మార్కెట్ ఆసీలు తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్, ఏఈ, టిపిఎస్ శానిటేషన్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

సేవలకు ప్రతిరూపం... పీడీజీ విశ్వనాథం

శ్రీనివాస్ సేవలపై సర్వత్రా ప్రశంసలు

విశాలాంధ్ర-సోంపేట: సమాజంలో అవసరమైన వర్గాలకు సరైన సేవలందించడమే రోటరీ ముఖ్య ఉద్దేశ్యమని రొటేరియన్, పీడీజీ జి.విశ్వనాథం అన్నారు. రోటరీ క్లబ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశానికి విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సేవలకు ప్రతిరూపమే రోటరీ అన్నారు. నిరంతరం సామాజిక సేవలతో ప్రపంచ దేశాల్లో దూసుకుపోతున్న రోటరీ దశాబ్దాలుగా ఎందరికో ఆదర్శమని అన్నారు. ఇటువంటి గ్రామీణ ప్రాంతాల్లో సైతం సమాజ అవసరాలను గుర్తించి వాటిని తీర్చేందుకు రోటరీ స్థానిక ప్రతినిధులు కృషి చేస్తున్నారని అన్నారు. సామాజిక అవసరాలు తీర్చడంలో రోటరీ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందని అన్నారు. గడచిన ఏడాది కాలంలో దుద్ది శ్రీనివాస్ అధ్యక్షులుగా అందించిన సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. సోంపేట, కంచిలి మండలాల్లో చక్కని అభివృద్ధి కార్యక్రమాలు రూపకల్పన చేసి వాటిని త్వరితగతిన సాధ్యం చేసిన శ్రీనివాస్‌ను అందరు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తాను అధ్యక్షునిగా సాధించిన ప్రగతిని వివరించారు. సోంపేటలో శ్రీశయన చైతన్యదీపిక స్వచ్ఛంద సంస్థ భవన నిర్మాణానికి 18లక్షలు రూపాయలు విలువైన స్థలాన్ని కేటాయించి దస్త్రాలు అందజేశారు. శ్రీనివాస్ దంపతులకు ఈ కార్యక్రమంలో చైతన్య దీపికతోపాటు పలు సంస్థలు ఘనంగా సన్మానించాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పీవీ కృష్ణారావు, పలువురు రోటరీ సభ్యులు, చైతన్య దీపిక ప్రతినిధులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, బీన ఆనంద్, బంజు లోకనాథం, దుద్ది బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో పలాస ఎమ్మెల్యే శిరీషా సమీక్ష

విశాలాంధ్ర-పలాస : పలాస ఎమ్మెల్యే శిరీషా మంగళవారం సాయంత్రం వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులతో టీడీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ సమీక్షలో ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపధ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా అధికారులు ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే వంశధార నుంచి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని, యుద్ధప్రతిపాదికన పనులు చేపడుతున్నామన్నారు. దీనికి ఇరిగేషన్ అధికారులు బృహత్తర కార్యక్రమంగా సాగునీరు అందించాలన్నారు. ఉద్యానవన శాఖ సమీక్షలో ఉద్దానంలో ఉద్యానవన పంటలకు పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా అధికారులు చేపట్టాలని రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు అందించడంతో పాటు కొత్తగా మొక్కలను పంపిణీ చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ సమీక్షాలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటికి ఎప్పటికప్పుడే టీకాలు వేసి పశుసంపదను అభివృద్ధి చేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఆదాయం సమకూర్చాలని వాటికి కావాల్సిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే దాతల ద్వారా ఆర్థిక సహాయం సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలాస టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి, జె.డి శ్రీధర్, పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖాధికారులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారం ఒక బాధ్యత : జనసేన పార్టీ నాయకులు పట్టి

విశాలాంధ్ర-పలాస: ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా భారీ విజయం ఎన్ డి ఏ కూటమికి కట్టబెట్టడంతో కూటమి నాయకులు అందరి మీద పెద్ద బాధ్యత ఏర్పడిందని జనసేన పార్టీ పలాస నియోజకవర్గ నాయకులు పట్టి ఉదయ్ కిరణ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన తరువాత తన శాఖకు సంబందించిన అభివృద్ధి అంశాలలో ప్రజలకు భాగస్వామ్యులను చేసి సలహాలు సూచనలు తీసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ సూచనల వేదిక ఏర్పాటు చెయ్యడం ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని అవలంబించడమనేది ఆయన గొప్ప స్వభావం అని అన్నారు. దశాబ్ది కాలం తరువాత కేంద్ర మంత్రి పదవి శ్రీకాకుళం జిల్లాకు వరించడం అది కూడా డైనమిక్ నాయకుడు కింజరాపు రామ్ మోహన్ నాయుడుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.పలాస నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీతో ఎమ్మెల్యే గౌతు శిరీష, గెలిచిన తరువాత ఆమె ప్రజా సమస్యలు తీర్చడం పై దృష్టి సారించారని ముఖ్యంగా వంశధార ఎడమ కాలువ రైతులకు నీరు అందించడానికి పనులు యుద్ధ ప్రతిపాదకన పూర్తిచేస్తున్నందుకు జనసేన పార్టీ తరుపున ధన్యవాదాలు తెలిపారు.త్వరలో ఆది నుంచి పార్టీ కష్టకాలంలో జనసేన జెండా మోసిన ప్రతి కార్యకర్తకు కలిసి ప్రజలకు ఎం డి ఏ ప్రభుత్వం మరింత దగ్గర చేసేందుకు ఎన్నికైన ప్రజా ప్రతినిధుల సూచనలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

శ్రీ పవనపుత్ర సేవా సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-మందస: ఎన్నో రక్తదాన శిభిరాలు నిర్వహించి, అత్యవసర సమ యాల్లో నేరుగా వెళ్లి రోగులకు రక్తదానం చేసి, ఎంతో మందిని రక్తదాతలుగా మార్చిన శ్రీ పవనపుత్ర సేవా సంస్థ, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహణ, టాలెంట్ టెస్ట్‌లు, స్టడీ మెటీరియల్ అందించడం, ఆవదలో ఉన్న వారికి నిత్యావసర సరుకు పంపిణీ, ఆర్థిక సహాయం అందించడం లాంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి నాలుగు ఏళ్ళు పూర్తి చేసుకొంది. సంస్థ కుటుంబ సభ్యుల సహకారంతో, కమిటి సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కోర్ కమిటీ సభ్యులు మంగళవారం సమావేశమై నూతన కమిటి ని ఏకగ్రీవంగా ఎన్నుకొంది. ఈ కమిటి లో అధ్యక్షులు గా ఆశపన్న బాలరాజు, ఉపాధ్యక్షులు పిరికట్ల చలపతి, కార్యదర్శి రాపాక కేశవరావు, సంయుక్త కార్యదర్శి తిరుపతి గౌడ, కోశాధికారి ఇప్పిలి ప్రదీప్ లను ఎన్నుకున్నారు, నూతన కమిటీ కి సంస్థ సభ్యులు అంగీకారం తెలిపారు.ఈ సందర్భంగా పాత కమిటి సభ్యులకు ధన్యవాదములు నూతన కమిటి కి అభినందనలు తెలియజేసారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న 'బగ్గు' దంపతులు

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి మంగళ వారం తన కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తిలోని శ్రీ కాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్ధ, ప్రసాదాలు స్వీకరించారు. అంతకు ముందు తిరుపతి సమీపంలోని తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దర్శనాన్ని కుటుంబసమేతంగా చేసుకున్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర సంతబొమ్మాళి : ఈ మండలం రుంకు హనుమంతపురం సచి వాలయంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రుంకు హనుమంతుపురం పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని గౌరినాయుడు, జగన్నాథపురం పంచాయతీ మాజీ సర్పంచ్ పుక్కల్ల శ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు విత్తనాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ని గౌరు నాయుడు, ఎన్ని నాగేశ్వరరావు, ఎన్ని చక్రదరరావు ఏ ఈ ఓ రామరాజు, రైతులు పాల్గొన్నారు.

ఎంపి కలిశెట్టి బీజేపీ నేత సిరిపురం అభిందనలు

విశాలాంధ్ర-కొత్తూరు: ఎంపీగా పార్లమెంట్ సభలో పదవీ ప్రమాణం చేసిన కలిశెట్టి అప్పలనాయుడుని పాతపట్నం బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరావు ఢిల్లీ ఎంపీ కలిశెట్టి తాత్కాలిక నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సభలో గొంతెత్తాలి అని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టిని కోరినట్లు బీజేపీ నేత సిరిపురం ఇక్కడ మీడియాకు తెలిపారు. ఎంపీ కలిశెట్టి కుటుంబ సబ్యులు కూడా ఉన్నారు.

పరిశోధన రంగంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో బోధన, పరిశోధనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీ 17వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బోధనా, బోధనేతర సిబ్బంది కొరత, వసతుల లేమి, ఆర్థిక ఇబ్బందులు తదితర వాటిని ఎదుర్కొంటూనే వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నామన్నారు. వనరుల దుర్వినియోగం, వర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించడం వంటి చర్యలకు వర్సిటీ వర్గాలు దూరంగా ఉండాలని హితవు పలికారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య మాట్లాడుతూ ప్రజా సంఘాలు, మేధావుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఈ వర్సిటీ ప్రగతి దిశగా పయనించేలా కృషి జరగాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్. ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఉపాధి కోర లను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తేవడంలో వర్సిటీలో ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, అకడమిక్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, సీడీసీ డీన్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్. లోకేశ్వరి, పాలకమండలి సభ్యులు కె. మాధవి, డాక్టర్ కె.చక్రవర్తి తదితరులు మాట్లాడారు. తొలుత వర్సిటీ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ

విశాలాంధ్ర-కవిటి: మండలలోని బోరివంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామమైన కుసుంపురం గ్రామంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మలేరియా వ్యతిరేక మాసోత్సవం పై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ని వైద్యాధికారి డాక్టర్ తేజ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి డాక్టర్ తేజ వెంకటేష్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుండి జూన్ 30 తేదీ వరకు అన్ని గ్రామాలలో మలేరియా వ్యతిరేక మా సోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని, అంటూ వ్యాధులు ప్రజలకు సోకకుండా ఈ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఊర్మిళాశివ బిసాయి, ఎంపీటీసీ సభ్యులు కర్రీ పద్మావతి సత్యనారాయణ, ఈవో ప్రసాద్, హెచ్ వి పద్మావతి, పంచాయతీ కార్యదర్శి రవిబాబు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఏఎస్‌హెచ్‌ఏఎస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంచుమయ్యమ్మ తల్లి చల్లదనం..

విశాలాంధ్ర-మందస : మందస కంచమయమ్మ కాలనీలో మంగళవారం అమ్మవారి చల్లదనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీ భక్తులు ఘట్టాలతో భక్తి శ్రద్ధతో తెల్లవారుజాము నుంచి మేళతాళముతో వేదమంత్రాల మధ్య అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి తెల్లదనం కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

నామినేట్ పదవులు టీడీపీ ప్రభుత్వానికి సవాల్ ?...

మిత్రులకు ఎంతో కొంత ఇవ్వాలి

విశాలాంధ్ర-కొత్తూరు : ఐదేళ్లు పార్టీ కోసం కష్ట నష్టాలు పడ్డ టీడీపీ స్థానిక నాయకులు కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల త్వరలో ఇస్తా మని ముఖ్య నేతలు తో రెండ రోజుల క్రితం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ అధినేత ,సిఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన ఆ పార్టీ లో ఆశలు రేకెత్తించాయి ప్రస్తుతం నియోజిక వర్గ స్థాయిలో పి.ఏ.సిఎస్ లు (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు) వ్యవసాయమార్కెట్ కమిటీ లు(ఏ.ఎం.సి లు) . ప్రభుత్వ అసుపత్రి అభివృద్ధి కమిటీలు ,విటీకి తోడుగా పార్టీ కమిటీలు ఖాళీలు గా ఉన్నాయి ..ఐతే వీటి నియామకాలు అధికార పార్టీ ఏం.ఎల్.ఏ ల చేతిలో ఉంటాయాన్నది బహిరంగ రహస్యమే ? ఇక్కడే అసలు చిక్కు ఉంది. . అధికార పార్టీ అంటే ఇపుడు టీడీపీ ఒక్కటే కాదు టీడీపీ ఆద్వర్యం లో గల కూటమి ప్రభుత్వం .నామినేటెడ్ పదవు ల్లో టీడీపీ తో పాటు జనసేనా, బీజేపీ పార్టీ లు కు చెందిన నాయకులు కార్యకర్తలకు కూడా కొన్ని నామినేటెడ్ పోస్టులు ఎన్నో కొన్ని ఇవ్వాలి ,ఇందు లో. సామాజిక సమీ కరణలు చూడాలి ఏం.ఎల్.ఏ లకు నామినేటెడ్ పోస్టుల భర్తీ ఒక సవాల్ అని ఛప్పాలి.

సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్త అవసరం

ఎంపీడీవో జి ఉమా సుందరి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రస్తుత సీజన్లో మండలంలో వివిధ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంతబొమ్మాళి మండలం ఎంపీడీవో జీ. ఉమా సుందరి అన్నారు. మంగళవారం సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయం సిబ్బందితో కన్వర్షేషన్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో సైనిటేషన్, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి సీజనల్ వ్యాధులకు గురైన వ్యాధులపై సమగ్ర%శీ%గా తెలుసుకొని తగిన సమాచారం ఆరోగ్యశాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జె ఈ మధు తో పాటు ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూములు ఆక్రమించారంటూ తాసిల్దార్ కు ఫిర్యాదు.

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: ఈ మండలం పాతమేఘవరం ప్రాంతంలో కల ఫారెస్ట్ భూముల్లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి రొయ్యలు హేచరీస్ నడిపిస్తున్నారంటూ సంతబొమ్మాళి తాసిల్దార్ కు, సంతబొమ్మాళి మండలం మత్స్యకార సంఘం నాయకులు సూ రాడ ధనరాజు, వారాధి చంటి మంగళవారం ఫిర్యాదు చేశారు. అలాగే సి ఆర్ జెడ పరిధిలో రొయ్యలు హేచరి ఫ్యాక్టరీ నిర్మించారని, ప్రభుత్వానికి సంబంధించి మత్స్యశాఖ, ఫారెస్ట్ శాఖ సంబధించి ఎటువంటి అనుమతులు లేవని ఆ ఫిర్యాదుల పేర్కొన్నట్లు వారు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్మూలనపై దృష్టి సారించండి

ఎంపీడీవో భాస్కర్ రావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: గ్రామాలలో పారిశుద్ధ్య నిర్మూలనపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని ఎంపీడీవో జి. భాస్కర్ రావు అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించడంతోపాటు రక్షిత మంచినీటి పథకం ట్యాంక్, బావిలను మంగళవారం పరిశీలించారు. ఇటీవల కాలంలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు గ్రామాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తూనే, రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని మరమ్మతులు చేపించి ప్రజలకు పూర్తిస్థాయిలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ప్రజా సమస్యలకు సంబంధించి గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కార్యదర్శి అప్పారావుకు సూచించారు. ఈ సందర్శనలో ఎంపీడీవోతో పాటు పిఓపిఆర్డి తారకేశ్వరి, స్థానిక సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, ఉపసర్పంచ్ మాడుగుల భానుజీరావు, స్థానిక కార్యదర్శి చింతల అప్పారావు తదితరులున్నారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-కవిటి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి నూతన ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యకు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు మొర్రి గోపి అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన ఏపీటీఎఫ్ అత్యవసర సమా వేశంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందన లు తెలుపుతూ తీర్మానం చేశారు. కవిటి మండలం మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి తల్లి అకాల మరణముకు సభ్యులు సంతాపం తెలియజేశారు. నూతన పిఆర్సి పై నూతన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం మరియు ఇంగ్లీష్ మాధ్యమం కొనసాగిం చాలని, పాత బకాయిలు ఇవ్వడానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, మండల ప్రధాన కార్యదర్శి గుడియా వంశీ, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు కార్యవర్గ సభ్యులు శ్రీధర్ సమంతో, భార్గవ్, శరత్, ప్రకాష్, భగవాన్, శ్రీకాంత్, వెంకట్రావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించిన

టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ వి రమణ

విశాలాంధ్ర-కవిటి: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో భాగంగా మండలం లో గల కవిటి మేజర్ గ్రామపంచాయతి పరిధిలో కవిటి కొత్తూరు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను, టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవి. రమణ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జి.వీరభద్ర స్వామి, వార్డు సభ్యులు ఎస్. సత్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన ప్రజా గొంతు

ఓంకార్ మస్టారు మృతి

విశాలాంధ్ర-పలాస : మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన బత్తిన ఓంకార్ మస్టారు గుండెపోటుతో మంగళవారం ఉదయం విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రస్తుతం ఆయన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. అనగారిన వర్గాల ఆయుధం గానించి ప్రజాగొంతుకుగా ఆయన మాట ఆట పాటల ద్వారా సామాజిక అంటరాని తనంపై సూతిమెత్తగా ఎదిరించి ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలకు అండగా నిలిచిన ఉద్యమ శిఖరం ఓంకార్ మస్టారు. ఆయన 9వ తరగతి చదువుతున్న సమయంలో ఎస్.ఎఫ్.ఐ సంఘంలో చేరి శ్రీకాకుళం జిల్లా కమిటీ బాధ్యుడుగా అనేక విద్యార్థి సమస్యలపై విద్యార్థుల పక్షాన పోరాటం జరిపారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీలో పి.జిలో చేరిన తరువాత ఎస్.ఎఫ్.ఐ, ఎ.యు , విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తరువాత కాలంలో సి.పి.ఎం పార్టీలో చేరి పార్టీ పిలుపు మేరకు ప్రజాసమస్యలపై జరిగిన పోరాటంలో నాయకత్వం వహించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తరువాత ఐక్య ఉపాధ్యాయ సంఘం (యు.టి.ఎఫ్)లో చేరి ఉపాధ్యాయ సమస్యలపై పలు పోరాటాలు చేశారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఉద్దానం అభివృద్ధి చెందాలని ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక (యు.వి.వి) వ్యవస్థాపకుల్లో ఒకరిగా విద్య, సాంస్కృతిక రంగాల్లో కాకుండా మహమ్మరి ఉద్దాన కిడ్నీ వ్యాధి నివారణపై అనేక పోరాటాలు చేసిన వ్యక్తి ఓంకార్ మస్టారు. అదే విధంగా నీలావతిలో యు.వి.వి గ్రంథాలయ నిర్మాణంలో చురుకైన పాత్ర వహించి అనేక పుస్తకాలు సేకరించి అందుబాటులోకి తెచ్చారు. కిడ్నీ వ్యాధి నివారణ కోసం ఉద్దాన ప్రాంతమంతా పర్యటన చేసి సమస్యలు అధికారులకు తెలియజేసేవారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేసి ప్రజాసమస్యలపై జరిపిన పోరాటాల్లో ముందుండి పోరాడిన వ్యక్తి, ఉపాధ్యాయ సంఘ నాయకుడుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా, సిపిఎం పార్టీ నాయకుడుగా, ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేశారు. ఉపాధ్యాయుల వృత్తి చేస్తూనే సమాజంలో జరుగుతున్న ఎదుర్కొంటున్న అసమానతలకు వ్యతిరేకంగా తన కళ్లముందు కనబడిన ఎ ఉద్యమంలోనైనా మమేకమై డప్పు కొట్టి పాట పాడి తన ఆరోగ్యం బాగోలేదని తెలిసినా రెట్టింపు ఉత్సహంతో ఉద్యమ స్పూర్తితో ఉద్యమాల్లో కొనసాగిన వ్యక్తి ఓంకార్ మస్టారు. మహమ్మరి కిడ్నీ వ్యాధితో ఉద్దానం కోల్పోతుందని, ఉద్యమ బాట పట్టాలని, ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం జరుగుతుం దని, ఉద్దాన ప్రాంత ఆరోగ్య పరరిక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఓంకార్ మస్టారు ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వరకు పల్లె పల్లె తిరిగి ప్రజలను చైతన్య పర్చడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఓంకార్ మస్టారు మృతికి సిపిఎం, గ్రీన్ ఆర్మీ, గిడుగు రామ్మూర్తి తెలుగుభాషా జానపద కళాపీఠం సభ్యులు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పట్టణ పౌర సంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు, ఉద్దాన విద్యావేదిక, ఉద్దాన ఆరోగ్య పరిరక్షణ వేదిక సభ్యులు. సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ ఓంకార్ మస్టారుకు నివాళ్లు అర్పించారు.

బత్తిన ఓంకార్ మస్టారు (పాతచిత్రం)